క్లుప్తంగా

ప్రభుత్వాస్పత్రి తనిఖీ



తిరువూరు: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వార్డులను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి సుహాసిని ఆదివారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో చేరిన రోగులకు అందుతున్న వైద్యచికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సకాలంలో వైద్యసేవ లందించాలని సూచించారు. జ్వరపీడితుల వార్డులో రోగులతో డీఎంహెచ్ఓ మాట్లాడారు. గ్రామాల్లో జ్వరపీడితుల సర్వే నిర్వహించాలని, రోజుల తరబడి జ్వరంతో బాధపడేవారిని ఆస్పత్రుల్లో చేరేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దోమల నివారణకు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. జిల్లా మలేరియా అధికారి మోతీబాబు, చౌటపల్లి, రాజుగూడెం, తిరువూరు ఆస్పత్రుల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ



గంపలగూడెం: వాసవీ క్లబ్ వారోత్సవాల్లో భాగంగా గంపలగూడెం మండలం ఊటుకూరుకు చెందిన వాసవి, వనిత, కన్యక క్లబ్బుల సంయుక్త ఆధ్వర్యంలో తిరువూరు అమ్మ ఆశ్రమానికి రూ. 7వేల విలువైన సామగ్రిని ఆదివారం అందజేశారు. ఈ మొత్తంతో అవసరమైన నితావసర వస్తువులు, దుస్తులు, బియ్యం అందజేసినట్లు వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ కాజా శ్రీనివాసరావు తెలిపారు. వాసవీ, కన్యక క్లబ్‌ల అధ్యక్షులు నేరెళ్ల శేషగిరిరావు, రోశయ్య పాల్గొన్నారు.

వరకట్నం వేధింపుల కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యనమలకుదురు నేతాజీ రోడ్డుకు చెందిన లాడి హేమలత ఆ ఏడాది జూన్ 7వ తేదీన ఒడిస్సా రాష్ట్రం రాయగడ జేకేపూర్‌కు చెందిన సంతోష్ కుమార్‌ను కట్న కానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. భర్త జేకే పేపర్ మిల్స్‌లో పని చేస్తాడు. పెళ్లి సమయంలో హేమలతకు ఉన్న గుండె జబ్బు గురించి ముందుగానే చెప్పి పెళ్లి చేశారు. కాగా పెళ్లి చేసుకున్న మూడు రోజులకే తరువాత భర్త సంతోష్‌కుమార్ గుండెజబ్బు ఉన్నందున అధిక కట్నం కావాలని డిమాండ్ చేస్తూ వేధించటం ప్రారంభించారు. భర్తతో పాటు అత్త ఉమ, బావ శివ, ఆడపడుచు భాగ్య, బంధువులు సృజన్, శ్రావ్య, కుమార్, అప్పలరాజు అదనపు కట్నం కోసం వేధించటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు అత్తింటివారి పై కేసు నమోదు చేశారు.

భవనంపై నుంచి దూకిన వ్యక్తికి గాయాలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): భార్యతో గొడవపడి ఓ వ్యక్తి భవనంపై నుంచి కిందకు దూకేసిన ఘటన సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్ వెంబడి ఉన్న అపార్ట్‌మెంట్‌లలో ధూపాటి ఏసు, పర్వీన దంపతులు నివసిస్తున్నారు. కొంతకాలం క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే భార్యాభర్తల మధ్య కొన్ని రోజుల నుంచి చిన్న చిన్న గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం కూడా ఇదే విధంగా గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన ఏసు మూడో అంతస్తు నుంచి కిందకు దూకేందుకు ప్రయత్నించగా స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సింగ్‌నగర్ సీఐ గురుప్రకాష్, ఎస్ఐలు దుర్గాదేవి, సత్యనారాయణ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఏసు పరిస్థితి నిలకడగానే ఉందని, వివరాలు సేకరించి ఈ ఘటనపై తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సంకట చతుర్థి పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఆదివారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన సంకట చతుర్థి పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు శ్రీవిజయగణపతి స్వామివారికి విశేషంగా పంచామృతం, పసుపు, కుంకుమలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం రుద్రాభిషేక అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు చర్యలు

ఏ.కొండూరు: తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి సహకారంతో మండల ప్రజలకు స్వచ్ఛమైన కృష్ణాజలాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నారు. తాగునీటిలో ఫ్లోరైడ్ శాంత అధికంగా ఉన్న ప్రాంతాలు, కిడ్నీ వ్యాధుల ప్రభావిత గ్రామాల్లో తాగునీటి పరీక్షలు చేయించి అవసరమైన చోట్ల ప్రజలు వ్యాధుల బారిన పడకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకుంటోంది.

సింటెక్స్ ట్యాంకుల ఏర్పాటు

మండలంలోని కిడ్నీ వ్యాధుల ప్రభావిత గ్రామాల్లో రెండు కోట్ల రూపాయల వ్యయంతో కృష్ణాజలాలు సరఫరా చేస్తున్నారు. జీళ్లకుంట, వల్లంపట్ల, గోపాలపురం, గ్యామా తండా, చైతన్యనగర్, ఏ.కొండూరు తండా, కుమ్మరికుంట్ల, రేపూడి తండా, మీట్యా తండా, దీప్లానగర్, మాన్సింగ్ తండా, కృష్ణారావుపాలెం, పెద్ద తండా, వెంకట్ తండా, కోమటికుంట గ్రామాల్లో అవసరమైన చోట్ల సింటెక్స్ ట్యాంకులు ఏర్పాటు చేసి, రెడ్డిగూడెం మండలం కుదప గ్రామంలో ఉన్న కృష్ణాజలాల సంప్ నుంచి ట్రాక్టర్ల ద్వారా ఈ ట్యాంకుల్లో నీరు నింపి ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు.

80 శాతం పనులు పూర్తి

తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీరు అందించేందుకు పనులు జరుగుతున్నాయి. కోమటికుంట రూ. 18లక్షలు, దీప్లానగర్ రూ. 6లక్షలు, చైతన్యనగర్ రూ. 7.50 లక్షలు, పాత కొండూరు రూ.7.50లక్షలు, ఏ.కొండూరు తండా రూ. 8 లక్షలు, గొల్లమందల తండా రూ. 8.90 లక్షలు, ఈస్ట్‌మాధవరం రూ.12లక్షలు, వెస్ట్‌మాధవరం రూ. 13 లక్షలు, కేసీయా తండా రూ.20లక్షలతో డైరెక్ట్ పంపింగ్ స్కీమ్ ద్వారా పైపులు ఏర్పాటు చేసి, తాగునీరు ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో కుళాయిల ఏర్పాటు చేస్తున్నారు.



చైతన్యనగర్ తండాలో తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన సింటెక్స్ ట్యాంక్



పాతకొండూరు ఎస్సీ కాలనీలో తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్

కుళాయిల ఏర్పాటుకు టెండర్లు

స్థానిక ఎమ్మెల్యే రక్షణనిధి సహకారంతో మండలంలో అన్ని గ్రామాలకు కృష్ణాజలాలు సరఫరా చేయించాలనే ఉద్దేశంతో సుమారు రూ. 40 కోట్లతో ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటుకు టెండర్లు కూడా పిలిచారు. త్వరలో పనులు ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు కొన్ని ప్రాంతాల్లో తొమ్మిది వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి నీరు సరఫరా చేస్తున్నారు.

త్వరలో తాగునీరు అందిస్తాం

జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తొమ్మిది గ్రామాల్లో పైపులైన్ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి చేశాం. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేసి త్వరలో తాగునీటిని సరఫరా చేస్తాం.

– సీహెచ్ లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ముత్యాలమ్మకు గ్రామోత్సవం

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలం రుద్రవరంలో వర్షాలు కురవని పరిస్థితిలో గ్రామ ప్రజలు ముత్యాలమ్మకు గ్రామోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజ ద్రవ్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి, ఉప సర్పంచ్ వెంకట కృష్ణారెడ్డి, టీటీడీ ప్రచార కార్యదర్శి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ముత్యాలమ్మకు వెండి చీరతో అలంకరణ



ముత్యాలమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అంకమ్మ తల్లికి పసుపు కుంకుమల సమర్పణ

ముసునూరు: అంకమ్మ తల్లికి శ్రావణ మాస చీర, సారె, పసుపు కుంకుమలు భక్తులు సమర్పించారు. మండలంలోని గుళ్లపూడి శివారు గుడిపాడులో కొలువై ఉన్న రాజబోయిన వంశీకుల ఇలవేల్పు అంకమ్మ తల్లికి ఆ వంశ ఆడపడుచులు, గుడిపాడు గ్రామ ఆడపడుచులు, భక్తులు, మహిళా భక్తులు 250 మంది ఆదివారం మేళ తాళాలతో ఆలయం వద్దకు తరలివెళ్లారు.

గ్రామదేవతకు బోనాలు సమర్పణ

గంపలగూడెం: శ్రావణమాసం సందర్భంగా గంపలగూడెం ఆలయంలో ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ముందుగా అమ్మవారి అభిషేకం కనుల విందుగా జరిగింది. అమ్మవారికి వెండి చీర, వివిధ రకాల పుష్పాలు వేప ఆకులతో ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు వివిధ రకాల పిండివంటలను, పొంగలిని ఇంటి వద్ద తయారు చేసిన మేళతాళాలతో ఆలయం వద్దకు చేరుకుని, అమ్మవారికి బోనాలు సమర్పించారు.

అన్నదానం

ఇబ్రహీంపట్నం: స్థానిక ప్రేమ్‌నికేతన్ దివ్యాంగుల సంస్థలో గుడ్ సమరిటన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకులు చిట్టేలు కోటేష్, చిట్టేలు హరీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దివ్యాంగుల సమక్షంలో కేక్ కట్ చేశారు. అన్నదానం అనంతరం దివ్యాంగులతో కొద్దిసేపు ఆత్మీయంగా గడిపారు. చెల్లు రాజేష్ కుమార్, మల్లేశ్వరీ, క్రాంతిశ్రీ, హర్షితశ్రీ, నరేంద్ర, జ్యోతి, మోక్షజ్ఞ, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మైలవరం: శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని గరికపాటి పిరమిడ్ ధ్యాన కేంద్రం కన్వీనర్ గరికపాటి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆగిరిపల్లి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో మైలవరం పిరమిడ్ కేంద్రం సభ్యులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. మైలవరం ప్రధాన రహదారుల్లో శాకాహారం సంపూర్ణ ఆరోగ్యం అని ప్రచారం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ మేధావులంతా శాకాహారులేనని పేర్కొన్నారు. ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస అని, ధ్యానం చేసే పద్ధతులు వివరించారు.

నేడు 'స్పందన'

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందజేయవచ్చని పేర్కొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో..

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభంకానున్న స్పందనలో డివిజన్‌లోని ప్రజల సమస్యలపై అర్జీలను స్వీకరించి వాటిని గడువులోగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

పవళింపు మండపానికి శంకుస్థాపన

మెట్టగుట్ట(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను శివారు మెట్టగుట్టపై విరాజిల్లుతున్న శేషాచల శ్రీనివాసస్వామి ఆలయంలో దాతల విరాళంతో చేపట్టనున్న పవళింపు సేవ మండపం నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. రాజవరానికి చెందిన మొన్నే నరసింహమూర్తి, నిర్మల దంపతులు 23 యూనిట్ల శ్లాబ్ నిర్మాణానికి ముందుకు వచ్చారు. దీంతో దాత దంపతులు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆలయ అర్చకులు తూమాటి శ్యామసుందరాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జొన్నల ప్రతాపరెడ్డి, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

టైప్ రైటింగ్ పోటీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): టైప్ రైటింగ్ పోటీ పరీక్షల్లో మానస టైప్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ సురేష్‌బాబు పేర్కొన్నారు. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన ఆదివారం బహుమతి ప్రదానోత్సవంలో ప్రిన్సిపాల్ మోటూరు విజయ సారథి చేతుల మీదగా విద్యార్థులు బహుమతులను అందుకున్నారన్నారు. గత నెల 20న ది విజయవాడ కమర్షియల్ ఇన్‌స్టిట్యూట్స్ అసోసియేషన్ పరీక్ష నిర్వహించిందన్నారు. టైప్ రైటింగ్ ఇంగ్లిష్ లోయర్‌లో ఏచూరి పవన్ సాయికి ప్రథమ బహుమతి సాధించగా, ఇంగ్లిష్ జూనియర్ గ్రేడ్‌లో తోట భువనేశ్వరి తృతీయ బహుమతిని సాధించిందన్నారు. ఇంగ్లిష్ లోయర్ గ్రేడ్‌లో బైరెడ్డి అంజలి, కొత్తుర్తి సత్య, ఇంగ్లిష్ జూనియర్ గ్రేడ్‌లో వి. జెన్నీ షాలేమ్, ఎ. గిరిష్‌కుమార్‌లు మెరిట్ సర్టిఫికెట్స్‌ను సాధించారన్నారు.



ప్రథమ బహుమతిని అందుకుంటున్న విద్యార్థి

నేడు రిజిస్ట్రేషన్ మేళా

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని న్యూ రాజేశ్వరిపేట, వాంబే కాలనీలో గతంలో కేటాయించిన ఇళ్ల లబ్ధిదారులకు, లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన వారికి సోమవారం నుంచి వీఎంసీ రిజిస్ట్రేషన్ మేళా నిర్వహిస్తోందని కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి ఇళ్లను ఎలాట్ పొందినవారు, ఎలాట్‌పొందిన 10 సంవత్సరాల తర్వాత కొనుగోలు చేసిన నాన్ ఎలాట్ దారులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నామని, ఇందుకు గజం రూ. 100 చొప్పున 40 గజాల స్థలానికి రూ. 4వేలు, రిజిస్ట్రేషన్ చార్జీల నిమిత్తం రూ. 860 చొప్పున చెల్లించాలని అన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకునేవారు ఒరిజినల్ ఎలాట్‌మెంట్ పట్టా, నాన్‌ఎలాట్‌మెంట్‌దారులైతే వారి పేరుతో ఒరిజినల్ విక్రయ డాక్యుమెంట్(లింక్‌తో సహా), నోటరీ అఫడవిట్, ప్రస్తుతం చెల్లిస్తున్న నీటి, ఇంటిపన్నుల రసీదులు, ఆధార్‌కార్డు నకలు, ఇద్దరి సాక్షుల ఆధార్‌కార్డు నకలు తీసుకుని న్యూ రాజరాజేశ్వరి పేటలోని సచివాలయం నంబర్ 233, వాంబే కాలనీలోని డి బ్లాక్ కమ్యూనిటీ హాలులో జరిగే రిజిస్ట్రేషన్ మేళాలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ మేళా సోమవారం నుంచి వారం రోజులపాటు కొనసాగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇద్దరు పేకాటరాయుళ్ల అరెస్టు

పెనమలూరు: పేకాటాడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గోసాల గ్రామ పంచాయతీ పరిధి వైకుంఠపురం శివారులో కోతముక్క ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ రాజేష్ దాడి చేశారు. కోతముక్క ఆడుతున్న గోసాలకు చెందిన వి.దుర్గారావు, కంకిపాడుకు చెందిన కె.శంకర్‌రావు పట్టుబడ్డారు. మరో ఇద్దరు వ్యక్తులు ఎస్‌డీ కరీముల్లా, కె.రవీంద్ర పారిపోయారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తుల వద్ద రూ.1700, రెండు మొబైల్ ఫోన్‌లు, 4 బైక్‌లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల పై కేసు నమోదు చేశారు.

దివ్యాంగులకు వితరణ

తిరువూరు: వాసవీ క్లబ్ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గంపలగూడెం మండలంలోని ఊటుకూరు క్లబ్ ఆధ్వర్యంలో తిరువూరు అమ్మ ప్రేమాశ్రమంలో దివ్యాంగులకు నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల శేషగిరిరావు, జోన్ చైర్మన్ కాజా శ్రీనివాసరావు వీటిని ఆశ్రమ నిర్వాహకుడు రవిచంద్రకు అందజేశారు.

ఘన గాన చరితుడు ఘంటసాల

విజయవాడ కల్చరల్: ఘనగాన చరితుడు మన ఘంటసాల వేంకటేశ్వరరావు అని నాదబ్రహ్మ సంగీత కళాశాల నల్గొండ డాక్టర్ ఎం. పురుషోత్తమాచార్య అన్నారు. స్వరాలయ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వేంకటేశ్వరరావు సంగీత కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం, ఘంటసాల సినీ సంగీత విభావరి పద్మశ్రీ ఘంటసాల సంగీత వైభవం అంశంగా ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ పురుషోత్తమాచార్య మాట్లాడుతూ స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకొని తన జీవితాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకున్నారన్నారు. తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తీసుకువచ్చారన్నారు. సంస్థ అధ్యక్షుడు వై. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్వాహకులు డాక్టర్ పురుషోత్తమాచార్యను ఆత్మీయంగా సత్కరించారు. సినీ సంగీత విభావరి కార్యక్రమంలో భాగంగా ఘంటసాల స్వరపరచి గానం చేసిన మధురగీతాలను బాల కామేశ్వరరావు, శాంతిశ్రీ, వై. సుబ్రహ్మణ్యం పావని, ఎస్ఆర్ ప్రభాకర్ కల్యాణ శిరీష ఆలపించారు.



కార్యక్రమంలో పాల్గొన్న పురుషోత్తమాచార్య ప్రభాకర్, శాంతిశ్రీ తదితరులు

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

భవానీపురం(విజయవాడ పశ్చిమ): బధిరురాలైన చిన్నారి వైద్యం నిమిత్తం దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయాన్ని అందజేసింది. పటమట కాటా రోడ్‌లో నివసిస్తూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న శిరీష, రాజుల కుమార్తె రక్షిత (8) పుట్టుకతోనే చెవిటి, మూగ. చిన్నారి రక్షిత చెవులకు సర్జరీ చేస్తే వినగలుగుతుందని వైద్యులు చెప్పిన మీదట ఆపరేషన్ నిమిత్తం చిన్నారి తల్లిదండ్రులు దీవెన ఫౌండేషన్ సభ్యులను ఆశ్రయించారు. దీంతో విజయవాడ సిటీ పోలీస్ తరపున దీవెన ఫౌండేషన్ సభ్యులు పటమట ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ చేతుల మీదుగా రూ.10వేలు అందజేశారు. పటమట పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్స్ పైడేశ్వరరావు, కల్యాణ్, రైటర్ సాంబశివరావు పాల్గొన్నారు. ఆపదలో ఉన్న పేదవారికి సహాయం అందిస్తున్న దీవెన ఫౌండేషన్ సభ్యులకు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



చిన్నారి రక్షిత తల్లికి ఆర్థిక సాయం అందిస్తున్న సీఐ కాశీ విశ్వనాథ్

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా విజయలక్ష్మి ఎంపిక

ముసునూరు: మండలంలోని కాట్రేనిపాడు శివారు హరిశ్చంద్రపురం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం తూమాటి విజయలక్ష్మి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈఓ బీవీ సుబ్బారావు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా మంగళవారం ఏలూరులో జరుగనున్న కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీచర్ విజయలక్ష్మికి అధికారులు, ప్రజాప్రతినిధులు, సహచర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



తూమాటి విజయలక్ష్మి

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

రెడ్డిగూడెం: స్థానిక గీతాంజలి హైస్కూల్లో ఆప్సా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీలలో 400 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం 38 మంది ఉపాధ్యాయులకు సన్మానం చేయడంతో పాటు ఆటల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్లు ఉమ్మడి కృష్ణా జిల్లా ఆప్సా అధ్యక్షుడు గొల్లపూడి మోహనరావు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న లయోలా కళాశాల ప్రొఫెసర్ తుమ్మల శ్రీకుమార్ మాట్లాడుతూ దేశ భవిష్యత్ ఉపాధ్యాయులపైన మాత్రమే ఆధారపడి ఉందని, ఉపాధ్యాయుని స్థానంలో ఏ సాంకేతిక పరిజ్ఞానం పూరించలేదన్నారు. ఉపాధ్యాయులందరికీ కర్తవ్య బోధ చేశారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమావేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షుడు ఎం. శ్రీనివాసరావు, గీతాంజలి హైస్కూలు ప్రిన్సిపాల్ జి.మల్లికార్జునరెడ్డి, కరస్పాండెంట్ కే కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

గన్నవరం: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో గన్నవరం ప్రాంత విద్యార్థులు పలు పతకాలు సాధించినట్లు గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్పాడ చంద్రశేఖర్‌రావు తెలిపారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిప్పాడ మాట్లాడుతూ... ఇటీవల విశాఖపట్నంలో కరాటే ఇండియన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. ఈ పోటీల్లో అండర్–14 విభాగంలో గన్నవరానికి చెందిన మాన్య బంగారు పతకాన్ని, సీహెచ్. శ్రావణి రజిత పతకాన్ని సాధించినట్లు తెలిపారు. అండర్–14 బ్లాక్ బెల్ట్‌ను బొమ్మరెడ్డి జయంత్ కైవసం చేసుకున్నట్లు వివరించారు. వీరందరూ ఈ నెల 9, 10 తేదీల్లో కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్ యు.వెంకట్రామ్‌ను అసోసియేషన్ సభ్యులు అభినందించారు. కార్యదర్శి దేవరపల్లి విక్టర్‌బాబు, ప్రజ్ఞా స్కూల్ డైరెక్టర్ చెన్నారావు, రిటైర్డ్ ఏఎస్ఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కాలేయ సమస్యలు పెరుగుతున్నాయ్

ప్రముఖ వైద్యులు మహమ్మద్ రేలా

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆధునిక సమాజంలో కాలేయ వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని ప్రముఖ కాలేయ మార్పిడి వైద్య నిపుణుడు డాక్టర్ మహమ్మద్ రేలా అన్నారు. అందుకు అనుగుణంగా చికిత్సలు కూడా పెరగాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నగర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కాలేయ చికిత్సల గురించి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహమ్మద్ రేలా మాట్లాడుతూ కాలేయ వ్యాధులు ప్రధానంగా ఆహార అలవాట్లు, మద్యపానం వల్ల సంభవిస్తాయన్నారు. కొందరికి పుట్టినప్పటి నుంచి ఉంటాయని, మరికొందరికి స్థూలకాయం ద్వారా, ఆల్కాహాల్ తీసుకోవడం వల్ల కాలేయం దెబ్బతింటుందన్నారు. అయితే విదేశాల్లో ఉన్న అధునాతన చికిత్సా విధానాలు ప్రస్తుతం మన దేశంలోనూ అందుబాటులో ఉన్నాయన్నారు. దేశంలో 200లకు పైగా కేంద్రాల్లో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఏటా 20 వేల మందికి కాలేయ మార్పిడి అవసరం ఉండగా, కేవలం 3 వేల మందికి మాత్రమే జరుగుతున్నట్లు తెలిపారు. ప్రజల్లో ఇంకా అవగాహన పెరగాల్సి ఉందన్నారు. ఏపీ ప్రభుత్వం రూ.10 లక్షలు రాయితీ ఇస్తుందని, దానిని మరింత పెంచితే బాగుంటుందన్నారు. ఆహార అలవాట్లను మార్చుకోవడం, సరైన వ్యాయామం చేయడం, ఆల్కాహాల్‌కు దూరంగా ఉండటం ద్వారా కాలేయ వ్యాధులు రాకుండా చూడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ విజయవాడ శాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఎంఏ రెహమాన్, డాక్టర్ పీవీ దుర్గారాణి, డాక్టర్ సీహెచ్ మనోజ్‌కుమార్, డాక్టర్ సీహెచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ మహమ్మద్ రేలా, పక్కన డాక్టర్ రెహమాన్, పీవీ దుర్గారాణి తదితరులు

బాలుడు అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన కుమారుడు కనిపించడం లేదంటూ తండ్రి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట నైజాంగేటు ప్రాంతానికి చెందిన షేక్ అబ్దుల్ రహిమాన్ తన భార్యతో విభేదాల కారణంగా విడిపోయి, తన ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. రహిమాన్ కిళ్లీ కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తుంటాడు. కుమారుడు రయాన్ (11)గత నెల 30వ తేదీ సాయంత్రం ఏడు గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో స్నేహితులను, బంధువులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో తన కుమారుడు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. గతంలోనూ ఇదే తరహా ఇంటి నుంచి వెళ్లిపోగా, అప్పుడు పోలీసులు ఆచూకీ తెలుసుకున్నట్లు బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఖిద్మత్ వడ్డీ రహిత సేవలు అభినందనీయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఖిద్మత్ వడ్డీ రహిత సేవలు అభినందనీయమని ఖిద్మత్ రీజినల్ కో ఆర్డినేటర్ జకీఉద్దీన్ అన్నారు. జవహర్ ఆటోనగర్ లోని పంటకాలువ సమీపంలో విజయవాడ ఖిద్మత్ సొసైటీ వార్షిక జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జకీఉద్దీన్ మాట్లాడుతూ విజయవాడ శాఖలో గత సంవత్సరం నుంచి సుమారు 1,100 మందికి సుమారు మూడు కోట్లకు పైగా అందించినట్టు చెప్పారు. ఆంధ్ర, తెలంగాణాలో 41 బ్యాంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. వడ్డీలేని నగదును మధ్యతరగతి.. చిరు వ్యాపారులకు రుణం ఇచ్చామన్నారు. అంతే కాకుండా తీసుకున్న డబ్బును సక్రమంగా చెల్లించినవారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఖిద్మత్ జిల్లా అధ్యక్షుడు కరీముద్దీన్, కార్యనిర్వాహక అధ్యక్షులు హబీబ్‌ఖాన్, నగర అధ్యక్షుడు ఖలీలుల్లాహ్, మగ్బుల్‌బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కరీముద్దీన్